

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(బుధవారం)	సెహరీ(గురువారం)
కర్నూలు	6:36 (సాయంత్రం)	4:48 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:33 (సాయంత్రం)	5:01 (ఉదయం)
ఆదోని	6:38 (సాయంత్రం)	4:48 (ఉదయం)



నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలు, ఇండోర్ స్టేడియం

అంచనాలు పెంచి.. నిధులు ఊడ్చి..!

- ఎంపీ నిధులతో ఇండోర్ స్టేడియం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- రూ. లక్షలయ్యే పనులను రూ. కోట్లలో చూపుతున్న కాంట్రాక్టర్
- భారీగా నిధుల దుర్వినియోగం
- విచారణ జరపాలని డిమాండ్

ఆదోని, ఏప్రిల్ 2:

రూ. లక్షల్లో పూర్తయ్యే పనులకు రూ. కోట్లు వెచ్చించినట్లు లెక్కలు చూపారు. అంచనాలు పెంచేసి పనులు కానిచ్చారు. ఎంపీ నిధులను ఊడ్చేశారు. రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ స్వగ్రామంలో కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి వెచ్చించిన డబ్బును చూసి జనం అవాక్కయ్యారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారంటూ ఆరోపిస్తున్నారు.

ఆదోని నియోజకవర్గంలోని పెద్దతుంబలం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ స్వగ్రామం. గ్రామాభివృద్ధిలో భాగంగా 2021లో పంచాయతీ పరిధిలోని స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి టీజీ నిధులను కేటాయించారు. రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆదోనికి చెందిన నాగరాజు అనే కాంట్రాక్టర్‌కు పంచాయతీరాజ్ శాఖ పనులను అప్పజెప్పింది. ఆయన పెద్దతుంబలం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బసవరాజుకు సబ్ కాంట్రాక్ట్ పనులు అప్పజెప్పాడు. ఆయన కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు పూర్తి చేశారు. కమ్యూనిటీ హాల్ లోపల భాగం ఫ్లోరింగ్ పనులు, స్లాబ్ చుట్టూ గోడలకు ప్లాస్టింగ్ చేయాల్సి ఉంది. అప్పటికే రూ.50 లక్షలు ఖర్చయిందని చూపించి నగదు డ్రా చేశారు. మిగిలిన పనులకు మరో రూ.20 లక్షలు అవుతుందని అంచనాలు పెంచి చూపించి పనులను నిలిపేశారు.



ఫ్లోరింగ్ పనులు నిలిచి పోయిన కమ్యూనిటీ హాలు



రేకుల షెడ్డులో ఉన్న ఇండోర్ స్టేడియం

పనులు పూర్తి కాకుండానే పై అంతస్తులో ఇండోర్ స్టేడియం

గ్రామ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీజీ వెంకటేష్ తన ఎంపీ నిధుల నుంచి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రూ.68 లక్షలు ఖర్చు అవుతాయని పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు పంపింది. దీనికి టీజీ వెంకటేష్ ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇండోర్ స్టేడియం పనులు ఖాళీ స్థలంలో కాకుండా కమ్యూనిటీ హాలు పైనే ప్రారంభించారు. దీని వల్ల ఇండోర్ స్టేడియం నిర్మాణ వ్యయం తగ్గుతుంది. మొదటి అంతస్తు చుట్టూ గోడలు 5 అడుగులు లేపి, దాని పైన జీ సీట్స్ (ఇనుప రేకులు) వేశారు. రూఫ్ కూడా ఇనుప రేకులు వేయడంతో మరింత ఖర్చు మిగిలించుకున్నారు. ఈ మాత్రం పనులకు రూ.68 లక్షల ఖర్చు ఎందుకయిందో అర్థం కావడం లేదు.

పర్సంటేజీల కోసమే అంచనాలు పెంచారు

సదరు కాంట్రాక్టర్ నుంచి పర్సెంటేజీ తీసుకోవడానికి భారీగా అంచనాలు పెంచి నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్, అధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి ఈ అవినీతికి పాల్పడ్డారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నిపుణుల చేత ఈ పనులపై విచారణ జరిపిస్తే ఏ పనికి ఎంత ఖర్చయిందీ, ఎంత వెచ్చించారు? అనే వాస్తవాలు తెలుస్తాయని ప్రజలు అంటున్నారు.



ఇండోర్ స్టేడియం గ్లోబల్ భాగం ఇదే

పది అడుగుల గుంతలో నుంచి నిర్మాణం పట్టాం



కమ్యూనిటీ హాలు, ఇండోర్ స్టేడియం పనులను రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ నిధులతో చేపట్టాం. గ్రామంలో స్థలం లేకపోవడంతో పంచాయతీ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన గుంతలో పది అడుగుల లోతు నుంచి పిల్లర్లు వేశాం. దీంతో వ్యయం పెరిగింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విడుదలైన నిధులు చాలక పోవడంతో, నిర్మాణానికి కొరత ఏర్పడింది. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఒక్క పైసా కూడా నిధులు విడుదల కాలేదు. అయినా పనులు 95 శాతం పనులు పూర్తి చేశాం.

-బసవరాజు, సబ్ కాంట్రాక్టర్

అంచనాలు పెరిగిన మాట వాస్తవమే



పెద్దతుంబలం గ్రామంలో చేపట్టిన కమ్యూనిటీ హాల్‌కు నిధులు సరిపోలేదు. దీంతో అంచనాలు పెంచాల్సి వచ్చింది. ఈ విషయం ఎంపీ దృష్టికి కూడా తీసుకెళ్లాం. నిధులు సరిపోకపోవడంతోనే ఫ్లోరింగు, ప్లాస్టింగ్ పనులను నిలిపివేశారు. ఈ పనులకు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. మరో రూ.20 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. నిధులు చాలక పనులను ఆపివేశారు. ఇందులో అవినీతికి తావు లేదు.

-మాలిక్, ఇంజనీర్, ఆదోని

ఎన్నికల నిర్వహణపై అవగాహన తప్పనిసరి

- అధికారాలపై స్పష్టత ఉంటేనే ధైర్యంగా పని చేయగలం
- పత్తికొండలో స్వీప్ ఓటు హక్కు ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ సృజన



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి సృజన

పత్తికొండ, ఏప్రిల్ 2 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయి అవగాహన తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. సృజన అధికారులకు, సిబ్బందికి సూచించారు. మంగళవారం పత్తికొండలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నాలుగు స్తంభాల కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిర్వహించిన స్వీప్ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక గోపాల్ ప్లాజాలో పత్తికొండ నియోజకవర్గ సెక్టోరియల్ అధికారులు, బూత్ లెవెల్ స్థాయి అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్ బృందాలకు ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకొనేలా చేయడంలో బీఎస్‌ఓల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఓటరు నమోదును రికార్డు చేసి ఉంచాలని, ఓటరుకు ఏదైనా ఇబ్బంది తలెత్తినా, ఓటు గల్లంతైనా నమోదు చేసిన రికార్డును పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ సామగ్రి తీసుకోవడంతో మొదలు పెట్టి, పోలింగ్ ముగిశాక ఈవీఎంలు స్ట్రాంగ్ రూంకు చేర్చే వరకు బాధ్యత ఉంటుందని అన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అధికారాలు ఉంటాయని, అవి ఏమిటో తెలుసుకున్నప్పుడే భయపడకుండా ఎన్నికల విధులను సవ్యంగా నిర్వహించగలం అని అన్నారు. ఈ సమావేశంలో పత్తికొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి రామలక్ష్మి, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

రూ.వేల కోట్లను దోచేసిన వైసీపీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీటీ నాయుడు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.వేల కోట్లను దోచేసి ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు ఆరోపించారు. పింఛన్‌దారులకు ఇళ్ల వద్దకే వెళ్లి అందజేయాలని కోరుతూ టీడీపీ శ్రేణులు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బీటీ నాయుడు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ సొమ్ముతో పాటు జనవరి 23న బటన్ నొక్కిన ఆసరా డబ్బు, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన చేయూత డబ్బు, ఫిబ్రవరి 29న బటన్ నొక్కిన విద్యాదీవెన డబ్బు, మార్చి 14న బటన్ నొక్కిన ఈబీసీ నేస్తం డబ్బు, ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులు మొత్తం 13 వేల కోట్లను తన సొంత కాంట్రాక్టర్లకు దోచి పెట్టాడని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినందున వృద్ధులు, వికలాంగులు తదితరులకు సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సేవలను వినియోగించుకుని ఇళ్ల వద్దకే పింఛన్లను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతురావు చౌదరి, నాగేంద్ర కుమార్, సత్రం రామకృష్ణుడు, కుంబడి కృష్ణుడు, రవికుమార్, చిన్న మారెన్న, బాబు రాజ్, పరమేష్, వెంకటేశ్, నరసింహులు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

వలసలకు ప్రాధాన్యం

- అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్
- ఎంపీ అభ్యర్థిగా రాంపుల్లయ్య యాదవ్
- కోడుమూరుకు పరిగెల మురళీకృష్ణ



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 2: టీడీపీ, వైసీపీ నుంచి వచ్చిన అసంతృప్తులకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యమిచ్చింది. పార్టీలోకి చేరిన వెంటనే ఆయా నియోజకవర్గాలకు అభ్యర్థులుగా ప్రకటించింది. పీసీసీ కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన జాబితాను ప్రకటించింది. వీరిలో కర్నూలు ఎంపీ స్థానానికి లక్కీటూ బ్రదర్స్‌లో ఒకరైన రాంపుల్లయ్య యాదవ్‌ను ప్రకటించగా.. కోడుమూరు(ఎస్సీ) అసెంబ్లీ స్థానానికి మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణను ఎంపిక చేస్తూ కాంగ్రెస్ హైకమాండ్ జాబితాను విడుదల చేసింది. తెలుగుదేశం పార్టీలో దశాబ్ద కాలంగా కొనసాగిన రాంపుల్లయ్య యాదవ్ కర్నూలు ఎంపీ సీటు ఆశించి భంగపడ్డారు. ఈ క్రమంలో ఆయన హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్‌ను ఖరారు చేసుకున్నారు. అదేవిధంగా కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ సైతం వైసీపీ నుంచి కోడుమూరు టికెట్ ఆశించారు. ఆయనకు కాకుండా ఆదిమూలపు సతీష్‌కు వైసీపీ టికెట్ కేటాయించింది. నిజానికి 2019లోనే ఆశించినా అప్పట్లో జరదొడ్డి సుధాకర్‌కు అవకాశం కల్పించింది. ఆ తర్వాత మురళీకృష్ణ టీడీటీ సభ్యుడిగా కొనసాగారు. అదేవిధంగా నంద్యాల అసెంబ్లీ టికెట్‌ను ప్రస్తుత జడ్పీటీసీ సభ్యుడు గోకుల్ కృష్ణారెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానం కేటాయించింది. అదేవిధంగా నందికొట్కూరు(ఎస్సీ) స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌కు అవకాశం కల్పించారు. ఇదిలా ఉండగా వైసీపీలో బలమైన నేతలు కాంగ్రెస్‌లో టికెట్ దక్కించుకోవడంతో ఆ ప్రభావం వైసీపీ ఓటు బ్యాంకుపై పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



మురళీకృష్ణ



రాంపుల్లయ్య యాదవ్

వైసీపీకి షాక్..!

- తిరిగి టీడీపీ గూటికి బొజ్జమ్మ దంపతులు
- చంద్రబాబు సమక్షంలో చేరిక
- వైసీపీలో బీసీ మహిళకు అవమానం



కండువా కప్పి బొజ్జమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు, పక్కనే రామచంద్రనాయుడు

ఆలూరు/దేవనకొండ, ఏప్రిల్ 2: ఎన్నికల వేళ ఆలూరు నియోజకవర్గంలో అధికార వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆ పార్టీ నాయకుడు డి.రామచంద్ర నాయుడు దంపతులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వారికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేవనకొండ మండలంతో పాటు ఆలూరు నియోజకవర్గంలో బలమైన నాయకులుగా ఎదిగిన వారు తిరిగి సొంతగూటికి వెళ్లడంతో వైసీపీకి తీవ్ర నష్టం చేకూరనుంది. ఇదే సమయంలో బోయ సామాజిక వర్గానికి చెందిన బొజ్జమ్మ తెలుగుదేశం పార్టీలోకి రావడంతో ఆ పార్టీకి ఓటు బ్యాంక్ పెరిగే అవకాశం ఉంది.

వైసీపీలో అడుగడుగునా అవమానాలే..

దివంగత నేత కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడి హత్య అనంతరం ఆయన రాజకీయ వారసురాలిగా బొజ్జమ్మ రాజకీయాల్లోకి వచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పరి జడ్పీటీసీగా, ఆమె భర్త రామచంద్ర నాయుడు దేవనకొండ ఎంపీపీగా పని చేశారు. ఆ తర్వాత కోట్ల సుజాతమ్మ టీడీపీలోకి చేరడంతో, టీడీపీలో నామమాత్రంగా కొనసాగారు. వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన బొజ్జమ్మను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీలోకి తీసుకు రావాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో వైసీపీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గత ఏడాది జూన్19న టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఆ సమయంలో బొజ్జమ్మకు ఆలూరు అసెంబ్లీ టికెట్ ఇస్తానంటూ సీఎం జగన్ హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆమెకు గన్‌మెన్‌లను కూడా కేటాయించారు. ఇచ్చిన మాట తప్పిన జగన్ ఇటీవల ఆలూరు టికెట్‌ను చిప్పగిరి జడ్పీటీసీ విరూపాక్షికి కేటాయించారు. బీసీ మహిళకు వైసీపీ చేసిన ద్రోహాన్ని జీర్ణించుకోలేకపోయారు బొజ్జమ్మ వర్గీయులు. మరోవైపు కర్నూలు పార్లమెంట్ స్థానానికి అవకాశం ఇస్తారని ఆశించినా, అదే సామాజిక వర్గానికి చెందిన కర్నూలు మేయర్ బీవై రామయ్యకు టికెట్ కేటాయించింది. అప్పటి నుంచి బొజ్జమ్మ దంపతులు వైసీపీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. వారం రోజుల క్రితం జగన్ ఎమ్మిగనూరుకు వచ్చిన సందర్భంగా కూడా బొజ్జమ్మ హాజరు కాలేదు. స్వయంగా ఆలూరు సమన్వయకర్త విరుపాక్షి బొజ్జమ్మ ఇంటికి వెళ్లి నచ్చచెప్పినా, వారు ససేమీరా అన్నారు.

'టీడీపీ విజయానికి కృషి చేస్తాం'

టీడీపీలో చేరిన అనంతరం కప్పట్రాళ్ల బొజ్జమ్మ, డి.రామచంద్ర నాయుడు విలేకరులతో మాట్లాడుతూ తిరిగి సొంత గూటికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీడీపీలో సముచిత స్థానం ఇస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు. అదేవిధంగా టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజు, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

పింఛన్ల పంపిణీ పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2: ఈ నెల 6వ తేదీలోపు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం పింఛన్ల పంపిణీపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, సైనిక్ వెల్ఫేర్ పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మిగతా పింఛన్‌దారులందరికీ సచివాలయంలో పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశించారు.

మల్లన్న భక్తులకు రోజుకు 1.35 కోట్ల లీటర్ల నీటి సరఫరా

వేసవి తీవ్రత కారణంగా తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు

శ్రీశైలం, ఏప్రిల్ 2: శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఉగాది మహోత్సవాలకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లను చేపట్టింది. భక్తుల రద్దీ, వేసవి తీవ్రత దృష్ట్యా తాగు నీరు, ఇతర అవసరాల కోసం రోజుకు కోటి 35 లక్షల నీటిని సరఫరా చేయడానికి ఏర్పాటు చేసింది. క్షేత్ర పరిధిలోని పలు ప్రదేశాల్లో సుమారు 450 కుళాయిలు, 40కి పైగా సింటెక్స్ ట్యాంకులు, 11 ఆర్‌సీసీ వాటర్ ట్యాంక్స్, 34 ఆర్‌వో ప్లాంట్ల ద్వారా భక్తులకు మంచినీటిని అందజేస్తోంది. అలాగే శిఖరేశ్వరం, సాక్షిగణపతి, హఠకేశ్వరం, కైలాసద్వారం, పెద్దచెరువు, పాదయాత్ర మార్గ మధ్యంలో పలుచోట్లకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నారు. పాదయాత్ర భక్తులకు తాగు నీటి సమస్య తలెత్తకుండా కైలాస ద్వారం నుంచి భీమునికొలను వరకు మార్గమధ్యంలో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఎనిమిది సింటెక్స్‌లను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా కైలాస ద్వారం వద్ద ఐదు వేల లీటర్ల సామర్థ్యం గల ఎనిమిది సింటెక్స్ ట్యాంకులు, 20వేల లీటర్ల ఆర్‌సీసీ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.



ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

ప్రొఫెసర్ ప్రశాంతి



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్ ప్రశాంతి

నంద్యాల టౌన్, ఏప్రిల్ 2 : రైతుల ఆదాయాన్ని మెరుగు పరచడమే లక్ష్యమని శాస్త్రవేత్తల లక్ష్యమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. మంగళవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఆర్ఏఆర్ఎస్ సెంటనరీ భవన్‌లో అత్యల్ప వర్షపాత మండలం నాలుగు జిల్లాల పరిశోధన - విస్తరణ సలహా మండలి సమావేశం ముగిసింది. రెండు రోజుల పాటు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా సాగుకు అవసరమైన, అనువైన నూతన వంగడాలను రైతుల చెంతకు చేర్చేందుకు విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ పరిశోధనా స్థానాల్లో గత మూడేళ్లుగా జరుగుతున్న పరిశోధనల్లో మంచి ఫలితాలు ఇచ్చిన వాటిని రైతులకు, విస్తరణ విభాగం అధికారులకు వివరించారు. వివిధ పంటలకు సంబంధించిన ప్రధాన శాస్త్రవేత్తలు, ఏరువాక శాస్త్రవేత్తలు, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు 2023 -2024 ఖరీఫ్, రబీ పంటల పరిశీలనను, వాటిని అధిగమించే పరిశోధనా ఫలితాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో నంద్యాల డీపీవో మోహన్‌రావు, సత్యసాయి జిల్లా డీపీవో సుబ్బారావు, నంద్యాల, కర్నూలు, అంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన వ్యవసాయ, అనుబంధన శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోళ్లు, గొర్రెల పెంపకందారులూ.. జాగ్రత్త

బనగానపల్లె, ఏప్రిల్2: వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో కోళ్లు, గొర్రెలు, పాడి గేదెల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని యాగంటిపల్లె కృషివిజ్ఞాన కేంద్రం పశు శాస్త్రవేత్త డాక్టర్ బాలరాజు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత వల్ల కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి తగ్గితపోతుందని అన్నారు. దీని వల్ల కొక్కెర తెగులు తగులుతుందని అన్నారు. 5 రోజుల వయసు దాటిన అన్ని కోళ్లకు తప్పనిసరిగా లాసోటా టీకా వేయించాలన్నారు. గొర్రెలు, పొట్టేళ్లను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 గంటలనుంచి 6 గంటల వరకు మాత్రమే మేపడానికి తీసుకుపోవాలన్నారు. వేసవిలో ఉదయం పూట మేపి సాయంత్ర ఇంటి వద్ద మేపితే మంచిదన్నారు. వేడి వల్ల కలిగే ఒత్తిడి తగ్గించడానికి కోళ్లకు, గొర్రెలకు మిటమిన్స్ ఉన్న మందులను తాగించాలన్నారు. పాడి పశువులు, ముఖ్యంగా గేదెలు అధిక ఒత్తిడికి గురైతే పాల దిగుబడి తగ్గుతుందన్నారు. అధిక ఉష్ణోగ్రత వల్ల పశువుల్లో గేదెల్లో శరీర ఉష్ణోగ్రత కారణంగా శ్వాసక్రియ రేటు పడిపోతుందన్నారు. పశువులను చల్లటి ప్రాంతాల్లో ఉంచాలని నాఅ్నరు. షెడ్లలో ఉంచినప్పుడు వాటిపైన కొబ్బరి, తాటి ఆకులు లేదా బోద అమర్చాలని అన్నారు. గేదెలపై నీరు పిచికారి చేస్తూ చల్లబరచాలని అన్నారు.

రేపు ఆర్‌యూలో క్విజ్ పోటీలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 2: ఉన్నత విద్యామండలి ప్రతి సంవత్సరం నిర్వహించే క్విజ్ చాంపియన్-2024 రీజనల్ క్వాలిఫైర్స్ రౌండ్‌ను గురువారం రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎన్. అంకన్న తెలిపారు. క్విజ్ పోటీల్లో రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన 20 కళాశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో ఇప్పటికే జేఎన్‌టీయూ కాకినాడ, విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలల్లో పూర్తయ్యాయని, ఇందులో విజేతలుగా నిలిచిన బృందాలు త్వరలో విజయవాడలో జరిగే సెమీ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధిస్తాయని పేర్కొన్నారు. 4న ఉదయం వర్సిటీ సెనేట్ హాలులో ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్ కుమార్ పోటీలను ప్రారంభిస్తారని, ప్రొఫెసర్లు, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. రీజనల్ స్థాయి క్విజ్ పోటీల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.

ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 2: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు, నవంబరు మాసాల్లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం పరీక్షల విభాగం విడుదల చేసిన 2,3,5,7,9 సెమిస్టర్ ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. 3వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 38కి 6, 3వ సెమిస్టర్లో 54 మందికి 11, 5వ సెమిస్టర్లో 141 మందికి 26, 5 సంవత్సరం రెండో సెమిస్టర్లో 18 మందికి 5, 3వ సెమిస్టర్లో 9 మందికి 2, 7 సెమిస్టర్లో 20 మందికి 10, 9వ సెమిస్టర్లలో ఇద్దరు పరీక్షలకు హాజరు కాగా ఒక్కొక్కరు చొప్పున ఉత్తీర్ణత సాధించారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

తెలంగాణ పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తా

- చట్ట ప్రకారమే భూములను కొన్నా..
- నా భార్య, కొడుకును అరెస్టు చేశారు.. బెయిల్ వచ్చింది
- సీపీ శ్రీనివాసరెడ్డి కక్ష గట్టి అరెస్టుకు యత్నిస్తున్నారు
- 41-ఏ నోటీసు లేకుండా పోలీసులు ఎలా వస్తారు
- నేను ఎక్కడికి పారిపోలేదు.. అందుబాటులోనే ఉన్నా
- నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 2: తనపై, తన కంపెనీపై బురదజల్లేందుకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సీపీ శ్రీనివాసరెడ్డి కక్ష గట్టారని నంద్యాల జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివనందరెడ్డి అన్నారు. తెలంగాణ పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ పోలీసులు సోమవారం ఉదయం ఆల్లూరులోని తన నివాసానికి వచ్చిన పోలీసులతోనే రెండు గంటల పాటు ఉన్నా.. న్యాయవాదుల సలహా మేరకు వారిని 41-ఏ నోటీసులు అడిగినట్లు మాండ్ర చెప్పారు. దీంతో తనకు సమాధానం చెప్పుకోలేక తెలంగాణ పోలీసులు వెళ్లిపోయారన్నారు. ఈ విషయంపై తెలంగాణ పోలీసులను చూసి పారిపోయానని కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. నేను పార్టీ ప్రచారం కోసం బయటకు వెళ్లానన్నారు. తెలంగాణ పోలీసులు తనను అరెస్టు చేయడానికి వచ్చిన మాట వాస్తవమేనని, అయితే 41-ఏ నోటీసులు అడిగితే వెనుతిరిగారని తెలిపారు. ఆధారాలు లేకుండా ఏఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ శ్రీనివాసరెడ్డి తనపై కక్ష గట్టి అరెస్టు చేయించాలని పోలీసులను పంపారని తెలిపారు. ఇప్పటికే నా భార్య, కుమారుడిని అరెస్టు చేశారని, కానీ కోర్టులో మాత్రం విచారణ కోసం అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పిన విషయాన్ని మాండ్ర గుర్తు చేశారు. దీంతో తన భార్య, కుమారుడికి కోర్టు వెంటనే బెయిల్ మంజూరు చేసిందన్నారు. గతంలో భూముల విషయంలో రైతులకు సహకరించానని సీపీ శ్రీనివాసరెడ్డి తనపై కక్ష గట్టారని, ఆయన లా అండ్ ఆర్డర్‌ను పక్కన పెట్టి డ్రగ్స్‌ను కట్టడి చేయకుండా సివిల్ పంచాయతీలపై దృష్టి పెట్టారని ఆరోపించారు. 1970లోనే రైతులకు 4 నుంచి 5 ఏకరాల వరకు అసైన్డు భూములు అప్పటి ప్రభుత్వం రాసి ఇచ్చింది. వాటిని 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చట్ట బద్ధం చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్ఈజడ్ పేరుతో



సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

సేకరించిన భూముల్లో రైతులకు 800 గజాలు ఇచ్చి మిగిలిన భూములను సేకరించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. ఆ తర్వాత రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో భూములు రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తనపై తప్పుడు స్టేట్‌మెంట్‌లు తీసుకునేందుకు రైతులను బెదిరింపులకు గురి చేశారని, అయినా వారు తనకు వ్యతిరేకంగా చెప్పలేదన్నారు. ఇదే విషయంలో తెలంగాణ పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తానని మాండ్ర శివానందరెడ్డి హెచ్చరించారు. 'హైదరాబాద్ నగరంలో వెసిల్లా గ్రీన్స్ అనే కంపెనీ ద్వారా ఇప్పటికే 600 విల్లాస్ కట్టాం. ఎక్కడా చిన్న వివాదం కూడా లేదు. అన్నీ పక్కగా ఉంటేనే భూములను తమ కంపెనీ సేకరిస్తుంది..' అని మాండ్ర శివానందరెడ్డి పేర్కొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజశేఖర్, శ్రీదేవి

పత్తికొండ, ఏప్రిల్ 2 : వాళ్లిద్దరూ బావా మరదళ్లు. ఒకరినొకరు ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే పెద్దలు అంగీకరించకలేదు. దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ విషయాన్ని స్నేహితులకు ఫోన్ చేసి తెలిపారు. వారు వచ్చి అచేతనస్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పత్తికొండ మండల పరిధిలోని పులికొండ గ్రామ పరిసరాల్లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన సోమరాజుకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు సంతానం. ఆడపిల్లలకు పెళ్లిళ్లయ్యాయి. కొడుకు రాజశేఖర్ వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన నాగరాజుకు నలుగురు కుమారులు, నలుగురు కూతుళ్ల సంతానం. నాలుగో కూతురు శ్రీదేవి, రాజశేఖర్ ప్రేమించుకున్నారు. వరుసకు వీళ్ల బావా మరదళ్లు. అయినా పెద్దలు పెళ్లికి వీరి పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో వారు సోమవారం రాత్రి ఇంటి నుండి వెళ్లిపోయారు. వీరి కోసం రెండు కుటుంబాలవారు, గ్రామస్థులు వివిధ ప్రాంతాలలో వెదికారు. అయితే వీరు రాజశేఖర్ పొలం పక్కనే ఉన్న కొండలో రాత్రి ఉండి ఉదయాన్నే వెంట తీసికెళ్లిన పురుగుల మందు తాగారు. తాము ఒకరిని విడిచి ఒకరం ఉండలేమని, పెద్దలు తమపెళ్లికి ఒప్పుకోకపోవడంతోపాటు వేరేపెళ్లిళ్ల చేయాలని చూస్తున్నారని, అందుకని ఆత్మహత్య చేసుకుంటున్నామని మిత్రులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు ఆచూకీ తెలుసుకొని కుటుంబసభ్యులతో కలసి కొండ వద్దకు వెళ్లి, అక్కడ అచేతనంగా ఉన్న రాజశేఖర్, శ్రీదేవిలను పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందించి, మెరుగైన చికిత్స కోసం వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించండి: ఎస్పీ



నంద్యాల క్రైం, ఏప్రిల్ 2 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి సూచించారు. నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నవారిలో ద్విచక్రవాహనదారులే ఎక్కువ అని అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేశారు. ముఖ్యంగా హైవేలపై ద్విచక్రవాహనాల్లో ప్రయాణించేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలా ధరించకపోతే పోలీసులు గుర్తించి భారీగా జరిమానా విధిస్తారని అన్నారు. అతివేగం అనర్థదాయకమని పేర్కొన్నారు. ఇకపై ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సూచించారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 2: లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని డీఎంహెచ్‌వో వై. ప్రవీణ్ కుమార్ అన్నారు. నగరంలోని ఇల్లూరు నగర్ అర్బన్ హెల్త్ సెంటరులో ఆశా సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 నుంచి 22 వారాల హైరిస్క్ గర్భిణిలకు టపా స్కాన్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణిలను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇల్లూరునగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ నాగసౌమ్య, హెచ్ఈఈవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

నలుగురు కానిస్టేబుళ్ల బదిలీ

కర్నూలు, ఏప్రిల్ 2: గూడూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ మధుశేఖర్, సునీత, లోకేశ్, మధుగోపాల్‌లను ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. వీరంతా సొంత మండలానికి చెందిన వారు కావడం గమనార్హం. ఎన్నికల నిబంధనల మేరకు సొంత నియోజకవర్గంలో విధులు నిర్వహించకూడదు. అందుకోసమే నలుగురిని ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు రిలీవ్ చేసినట్లు ఎస్ఐ హనుమంతయ్య తెలిపారు.

నిందితుల అరెస్టు



అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

గోస్పాడు, ఏప్రిల్ 2 : మండలంలోని జూలేపల్లె గ్రామానికి చెందిన దొరకొండ సుదర్శన్ (35)హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గోస్పాడు పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ గత నెల 31వ తేదీ ఆదివారం దొరకొండ సుందర్శన్‌ను గోస్పాడు గ్రామానికి చెందిన మిద్దె మద్దిలేటి, మిద్దె వెంకటేశ్వర్లు, పసురుపాడు గ్రామానికి చెందిన కొడతలపల్లె కుమార్, కొడతలపల్లె సువర్ణ నలుగురు కలిసి ఉద్దేశ పూర్వకంగానే దాడి చేసి మిద్దె వెంకటేశ్వర్లు కత్తితో సుదర్శన్‌ను గాయపరిచారని తెలిపారు. దీంతో గాయపడిన సుదర్శన్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక ఈనెల 1వ తేదీ సోమవారం మృతి చెందాడు. దాడి చేసిన నలుగురిని పసురుపాడు ఊరి బయట ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

5,6 తేదీల్లో 'నిజం గెలవాలి'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 2: నంద్యాల నియోజకవర్గంలో నిజం గెలవాలి కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పర్యటన ఖరారైంది. ఈనెల 4వ తేదీ రాత్రి నంద్యాలకు చేరుకోనున్న భువనేశ్వరి 5, 6వ తేదీలలో జరిగే కార్యక్రమాలలో పాల్గొననున్నారు. నంద్యాలలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు. ఇందుకు సంబంధించి టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శిరివెళ్ల, ఏప్రిల్ 2: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన సంతోషమ్మ (22) అనే వివాహిత ఈనెల 1వ తేదీ రాత్రి ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేదని, దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు, ఏప్రిల్ 2: నగర శివారులో బెంగుళూరు రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పద్మావతినగర్‌కు చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదినారాయణ, ఆయన అల్లుడు గిడ్డయ్య డోన్ రహదారిలో వెళ్తున్నారు. వీరిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు.. గిడ్డయ్య గాయపడ్డాడు. స్థానికుల సాయంతో పోలీసులు గిడ్డయ్యను ఆసుపత్రికి తరలించారు. ఆదినారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మిగనూరులో పట్టపగలు చోరీ

ఉపాధ్యాయురాలి ఇంట్లో బంగారు, నగదు దొంగతనం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 2: ఎమ్మిగనూరు పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ లేబర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఉపాధ్యాయురాలి ఇంట్లో మంగళవారం పట్టపగలే దొంగలు పడి భారీగా బంగారు, నగదు దోచుకెళ్లారు. మాధవరెడ్డి, సరిత రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. మాధవరెడ్డి భార్య సరిత గుడికల్లులోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. సరిత ఉదయమే పాఠశాలకు వెళ్లగా మాధవరెడ్డి పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు ఇంటి తలుపులకు ఉన్న స్ర్కూలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 20 తులాల బంగారం, రూ.2లక్షల నగదును అపహరించుకెళ్లారు. ఇంటికి వచ్చిన మాధవరెడ్డి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ మధుసుదన్‌రావు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి విచారణ చేపట్టారు.

మంటల్లో చిక్కుకొని వ్యాపారి మృతి

పాములపాడు, ఏప్రిల్ 2 : పాములపాడులో మంటల్లో చిక్కుకొని విత్తనాల వ్యాపారి షేక్ ఫరూక్‌బాషా(50) మృతి చెందాడు. ఫారుఖ్‌బాషా ఫారుక్‌ట్రేడర్స్ పేరుతో ధాన్యం కొనుగోలు, అమ్మకాలు వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం రాత్రి పొద్దు పోయాక షాపులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. దీంతో మంటల్లో చిక్కుకొని కాలిపోయి చనిపోయాడు. మృతుని కుమారుడు అక్బర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో పంచనామా నిర్వహించి కుటుబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ప్యాసింజర్ రైళ్లు రద్దు

మద్దికెర, ఏప్రిల్ 2 : మద్దికెర నుంచి డోన్-కర్నూలు మీదుగా కాచిగూడ వెళ్లే ప్యాసింజర్ రైళ్లు 07671, కాచిగూడ నుంచి కర్నూలు, మద్దికెర మీదుగా గుంతకల్లుకు చేరుకునే 07670 ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు స్టేషన్ మాస్టర్ పరమేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్, గద్వాల ప్రాంతాల్లో రైల్వే పనులు జరుగుతుండటంతో నెల రోజుల పాటు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణీకులు గమనించాలని కోరారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 2: కర్నూలు జిల్లాలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6,120 మంది దరఖాస్తు చేసుకోగా, 4,018 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 15లోపు విద్యాలయాల్లో చేరాలన్నారు. ఎంపికైన విద్యార్థుల హాల్‌టికెట్ల వివరాలు..

జె 1091503	జె 1092815	కె 1091964
జె 1094342	జె 1092873	కె 1091980
జె 1089610	జె 1093703	కె 1093032
జె 1092691	జె 1093478	కె 1094633
జె 1088970	ఐ 1089741	ఎం 1090209
జె 1088988	ఐ 1093170	ఎం 1090996
జె 1091260	ఐ 1094250	ఎం 1091536
జె 1090574	ఐ 1090039	ఎం 1093047
జె 1091659	ఐ 1090927	ఎం 1094733
జె 1091662	బి 1092566	ఎం 1091511
జె 1091699	ఓ 1090351	ఎఫ్ 1093950
జె 1091988	ఓ 1091444	ఎల్ 1090701
జె 1092700	ఓ 1093803	ఎల్ 1090825
జె 1090261	ఓ 1092626	ఎల్ 1093626
జె 1090270	ఓ 1091304	ఎన్ 1091314
జె 1090320	పి 1090497	ఎన్ 1091014
జె 1090335	పి 1090645	ఎన్ 1091589
జె 1093917	పి 1093774	ఎన్ 1090491
జె 1090443	కె 1089207	ఎన్ 1094387
జె 1089224	కె 1089899	ఎన్ 1089197
జె 1089434	కె 1090476	ఎన్ 1093824
జె 1089821	కె 1093504	ఎన్ 1090417
జె 1090548	కె 1090994	ఎన్ 1091226
జె 1091236	కె 1093024	ఎన్ 1091351
జె 1091703	కె 1094536	ఎన్ 1089751
జె 1091926	కె 1091906	ఎన్ 1090029
జె 1091969	కె 1094865	

తెలంగాణలో కర్నూలు నాటకానికి ప్రశంసలు



శ్రీకృష్ణ కర్ణార్జునీయం నాటకంలో ఒక సన్నివేశం

కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 2: నగరంలోని టీజీవీ కళా క్షేత్రం కళాకారులు మంగళవారం రాత్రి తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా, మిర్యాలగూడలో ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటకం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం సంయుక్తంగా, మిర్యాలగూడ కళాభారతి ఆడిటోరియంలో నందిని నాటకోత్సవాలు-2023 నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు నాటకాన్ని ప్రదర్శించారు. నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య ఫోన్ ద్వారా మాట్లాడుతూ తన దర్శకత్వంలో, ప్రముఖ సినీ, టీవీ, నాటక రచయిత పల్లేటి కులశేఖర్ రాసిన ఈ నాటక ప్రదర్శనకు అపూర్వ స్పందన లభించిందని తెలిపారు.

కౌన్సెలింగ్ పేరుతో దుర్మార్గంగా వ్యవహరిస్తారా?: టీజీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 2: టీడీపీ 8 వార్డుకు కార్పొరేటర్ పరమేష్. సీనియర్ నాయకులు శేషగిరి శెట్టితోపాటు మరొకరిని పోలీసులు కౌన్సెలింగ్ పేరుతో ఎందుకు కొట్టారో చెప్పాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కౌన్సెలింగ్ పేరుతో పోలీసులు ఫోన్ చేసి పిలిపించుకొని దారుణంగా, దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. తమ పార్టీ నేతలపై ఎలాంటి కేసులు, రౌడీషీట్లు లేవని తెలిపారు. టీడీపీ నేతలపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. దీనిపై సరైన సమాధానం చెప్పకపో తే విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు హైకోర్టును కూడా ఆశ్రయిస్తామన్నారు. దాడి చేసిన ఎవ్వరిని వదిలే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. బుధవారం ఉదయం జిల్లా ఎస్పీని కలవనున్నట్లు తెలిపారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకుంటే రాష్ట్రంలో ఇదే ఆరాచక పాలన కొనసాగుతుందన్నారు.

టీడీపీ కౌన్సిలర్లకు కౌన్సెలింగ్

రాత్రి వరకు వదలకపోవడంతో ఉద్రిక్తత

కర్నూలు, ఏప్రిల్ 2: కర్నూలు వన్‌టౌన్ పోలీసులు టీడీపీ కౌన్సిలర్లు పరమేశ్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకులు శేషగిరిరావు మరి కొంత మంది టీడీపీ నాయకులను కౌన్సెలింగ్ పేరుతో స్టేషన్‌కు తీసుకెళ్లడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించి రాత్రి వరకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిలో కొంత మంది ముస్లిం నాయకులు ఉండటంతో వారిని పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా కొంతమంది టీడీపీ నాయకులపై పోలీసులు చేయిచేసుకున్నట్లు సమాచారం. కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలనే ట్రబుల్ మాంగర్స్ పేరిట డీటీసీకి తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. అయితే పోలీసులు మాత్రం అటు వైసీపీ, ఇటు టీడీపీ పార్టీలకు చెందిన పలువురు ట్రబల్ మాంగర్స్‌ను డీటీసీకి తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చామని చెబుతున్నారు. ఎన్నికల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని వెల్లడిస్తున్నారు. రెండు పార్టీల వారిని సమానంగా తీసుకెళ్లామని పోలీసులు చెబుతున్నారు. కేవలం తమ పార్టీకి చెందిన వారినే తీసుకెళ్లారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా మారే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన పోలీసులు టీడీపీ నాయకులను రాత్రివేళ వదిలేశారు.

పింఛన్లు ఇంటి వద్దనే పంపిణీ చేయాలి

● టెలి కాన్ఫరెన్సులో నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 2: నగర పాలక సంస్థ 133 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని కమిషనర్ ఏ.భార్గవతేజ టెలికాన్ఫరెన్స్‌లో సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పింఛన్ల పంపిణీపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆదేశాలకు అనుగుణంగా వలంటీర్లు పింఛన్ పంపిణీకి దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజులు ముందుగానే లబ్ధిదారులు వివరాలు సేకరించాలని, లబ్ధిదారులకు ఫోన్ చేసి ఇళ్ల వద్దనే ఉండే విధంగా నచ్చచెప్పాలని కమిషనర్ తెలిపారు. 3వ తేదీ సాయంత్రం పింఛన్ డబ్బులు సచివాలయ సిబ్బందికి చేరుతాయని అన్నారు. 4,5 తేదీలలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

గూడూరు: బుధవారం నుంచి వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని నగర కమిషనర్ దివాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వార్డు సెక్రటరీలతో సామాజిక పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పాదయాత్ర భక్తులకు ఉచిత వసతి



ఉచిత వసతి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్నాథం

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 2: శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తులకు సీఆర్ సేవా సమితి అధ్వర్యంలో ఉచిత వసతి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం సమితి అధ్యక్షుడు కే.జగన్నాథం ఈ ఉచిత వసతి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చే భక్తులు కేసీ కెనాల్ మీదుగా పాదయాత్రగా వెళ్తుంటారని అన్నారు. అలాంటి వారు కాసేపు సేద తీరేందుకు వసతి కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రామక్రిష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు సురేంద్రయాదవ్ పాల్గొన్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల అడ్మిషన్ల ప్రచారాన్ని అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కే.శివారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు సోమన్న అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నగరంలో ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా భారీ హోర్డింగ్‌లు, రంగు రంగుల కరపత్రాలతో విద్యాసంస్థల యజమాన్యాలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు వీటిని అరికట్టాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్, ఆల్తాఫ్, శ్రీకాంత్; సహాయ కార్యదర్శులు రంగస్వామి, విజయేంద్ర థామస్, ఈరేష్ పాల్గొన్నారు.

మాధవస్వామి ఆలయ హుండీ లెక్కింపు



గోరంట్ల గ్రామంలో శ్రీవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 2: మండలంలోని గోరంట్ల గ్రామంలో లక్ష్మీమాధవస్వామి ఆలయంలో హుండీ లెక్కింపును మంగళవారం అధికారులు చేపట్టారు. ఆలయ ఈవో గుర్రెడ్డి అధ్వర్యంలో లెక్కింపు పూర్తి చేశారు. ఆదాయ వివరాలను ఈవో వెల్లడిస్తూ శాశ్వత హుండీ రూ.2,13,451, అన్నదానం రూ.1,88,082 తాత్కాలిక హుండీ ద్వారా రూ.4,07,751 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అలాగే సేవా టిక్కెట్లు రూ.1,43,245, దుకాణాల నుంచి రూ.53,291, అన్నదానం కోసం చందా రూ.39,005 అందినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఎస్ఐ బాలనరసింహులు సిబ్బందితో కలిసి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మురళి, మాధవనాయుడు పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యపై దృష్టి పెట్టాలి

● రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.చెన్నయ్య



చెన్నయ్యను సన్మానిస్తున్న ట్యూటోరియల్స్ సిబ్బంది

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 2: విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యపై దృష్టి పెడితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని రిటైర్డు ప్రిన్సిపల్ డాక్టర్ కె.చెన్నయ్య తెలిపారు. స్థానిక బిర్లా కాంపౌండులోని ప్రీమియర్ జూనియర్ కళాశాలలో శ్రీ ఈశ్వరాస్ ట్యూటోరియల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీ పాలిటెక్నిక్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే, అన్ని అంశాల పట్ల సంపూర్ణమైన అవగాహన ఉండాలన్నారు. అనంతరం ట్యూటోరియల్స్ గౌరవ సలహాదారు డి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలో వివరాలను అందలి కోర్సులను అలాగే ఏపీఆర్‌జేసీకి సంబంధించిన కళాశాల వివరాలను తెలియజేశారు. అనంతరం గత సంవత్సరం వివిధ ఎంట్రెన్స్‌లో విజేతలైన విద్యార్థులను అభినందించారు. అనంతరం డా.కె.చెన్నయ్యను ట్యూటోరియల్స్ అధ్యాపక బృంధం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

గొందిపర్లలో టీడీపీ నాయకుడు మృతి

కర్నూలు(రూరల్)ఏప్రిల్ 2: కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయ పెద్దమద్దిలేటి మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గొందిపర్లకు వెళ్ళి మద్దిలేటి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత



20వ వార్డు టెలికాంనగర్‌లో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 2: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు టెలికాంనగర్‌లో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మాత్రమే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇవ్వగలరని స్పష్టం చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్నివర్గాల ప్రజలకు మంచిచేసే నాయకుడు చంద్రబాబు మాత్రమే అన్నారు. వైసీపీ పాలనతో విసుగు చెందిన ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టనున్నారని సైకిల్‌గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు.. ప్రజావ్యతిరేక విదానాలతో అవస్థలు పడ్డ వారందరూ ఓటుహక్కుతో జగన్‌కు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పెద్ద బీచుపల్లి, పల్లె రఘునాథ్‌రెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్‌రెడ్డి, కట్ట వెంకటరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మాంద్ర నరేంద్రనాథ్‌రెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, వీరేంద్రకుమార్, జనసేన నాయకులు ప్రవీణ్, విజయ్‌యాదవ్, టీచర్ జగదీస్, నాగముని, శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మామిదాలపాడు వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్)ఏప్రిల్ 2: కోడుమూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న కర్నూలు అర్బన్ మండలం మామిదాలపాడు గ్రామానికి చెందిన దాదాపు 44మంది వైసీపీ మహిళా కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి బందారు పద్మ ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డి, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో వైసీపీ మహిళ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారందరికి విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సుజాత,కేశమ్మ,రామేశ్వరి, సుగుణమ్మ,ప్రేమమ్మ, వెంకటలక్ష్మి, లక్ష్మమ్మ, మద్దయ్య, శాంతన్న, వెంకటేష్, సౌలురాజు తదితరులు ఉన్నారు.

● బెలగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన తిమ్మప్ప ఆధ్వర్యంలో స్థానిక వైసీపీ నాయకులు ఈ.ఎర్రన్న, వెంకటేష్, మధు, కేశాలు, సుంకన్న, గంగన్న, బుడ్డన్న, ప్రతాప్, యల్లప్ప, దానం, బోమేష్, అశోక్, ఈశ్వర్, తదితరులు కర్నూలులో టీడీపీ సీనియర్‌నేత విష్ణువర్దన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు.

● గూడూరు మండలం తారక్ టీమ్ అసోసియేషన్ సభ్యులు టీడీపీ నాయకుడు విష్ణువర్దన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. మద్దతు తెలిపిన వారిలో తెలుగు శీను, వేణు, శివసాయి, వడ్డెరాజశేఖర్, గణేష్, నాగేంద్ర, రవి, శీను, రేవుల వెంకటేష్, అల్లిభాష, గోపి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భారీగా బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 2: కోడుమూరు సెబ్ పోలీసులు మం గళవారం భారీగా బెల్లం ఊట ధ్వంసం చేసి నాటుసారా సీజ్ చేశారు. సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని అమకతాడు, ఎల్ బండ తాండ, బుక్కాపురం గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎల్ బండ తాండలో వాడిత్యా స్వామినాయక్, కరంథోట్ భాస్కర్‌నాయక్ అనే వ్యక్తులు నాటుసారా తయారు చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే పోలకల్ గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని రూ 25 వేలు జరిమానా విధించామని అన్నారు. దాడుల్లో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్ వీరుపాక్షిరెడ్డి, సువర్ణమ్మ పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 2: రాజకీయ ప్రచార వాహనాలకు, ప్రచారానికి ఉపయోగించే కరపత్రాలకు తగిన అనుమతులు పొందాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అధికారిక ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024, ఫారం 6, 7, 8ల పురోగతిని సమావేశంలో చర్చించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రచారాలకు తగిన అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రచార వాహనాలు, కరపత్రాల ముద్రణ, పంపిణీ తదితర వాటికి పొందిన అనుమతుల మేరకు ఉపయోగించాలని, ఎన్నికల ప్రచారానికి ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ - ఎన్నికల ప్రవర్తనా నియమావళి) పూర్తి నిబద్ధతతో కచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కర్నూలు అర్బన్ తహసీల్దారు మోహన్‌కుమార్, ఎలక్షన్ డీటీ ధనుంజయ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రంగస్వామి, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

సి. బెళగల్, ఏప్రిల్ 2: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామాన్ని సీఐ సందర్శించారు. గ్రామంలో రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. అనమతి లేకుండా ఎర్రమట్టి, ఇసుక తరలిస్తే జరిమానాతోపాటు ట్రాక్టర్లును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గ్రీన్ కో కంపెనీ, ఉలిందకొండ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2: రైతులపై బెదిరింపులకు గురిచేస్తున్న గ్రీన్ కో కంపెనీ, ఉలిందకొండ ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. గ్రీన్ కో కంపెనీ, పోలీసుల దౌర్జన్యం నుంచి రైతులను కాపాడాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధు, రాఘవేంద్ర, శివశంకర్, గోవిందు, రంగడు, సోమ్లా నాయక్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కర్నూలు జిల్లా ప్రధాన న్యాయ అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నూతన నాయకులు

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 2: ఇటీవల కర్నూలు బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలలో గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయ అధికారి ఎస్.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో వీరు జిల్లా ప్రధాన న్యాయ అధికారిని కలిసి పూలబొకేను అందజేశారు. వారు మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు సమన్వయంతో కృషి చేద్దామని వారు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నిత్యజీవన్‌రాజు, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, కోశాధికారి ఎం.మహబూబ్‌బాషా, గ్రంథాలయ కార్యదర్శి ఎస్.రామనాథ్, మహిళా ప్రతినిధి జి.సుమనరాణి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి బంగి సుధీర్‌లతో పాటు న్యాయవాదులు కూడా పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కర్నూలు(రూరల్)ఏప్రిల్ 2: కర్నూలు రూరల్ మండలం ఈ.తాండ్రపాడు గ్రామంలో గ్రామంలో లక్ష్మీనగర్‌లో శేషన్న, పులేందర్, శ్రీనివాసులు, వేణుగోపాల్‌కు చెందిన నాలుగు గడ్డివాములు మంగళవారం అర్ధరాత్రి దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గ్రామానికి వెళ్లి ఒక్కొక్క రైతుకు రూ.25వేలు చొప్పున నలుగురి రైతులకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రజల కష్టాలు తీరాలి



ఇఫ్తారు విందులో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 2: కర్నూలు నగరంలోని ప్రజల కష్టాలు అల్లా తొలగించాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఆకాంక్షించారు. మంగళవారం నగరంలోని ఆరోరా నగర్‌లో ఉన్న గౌస్ మసీదులో నిర్వహించిన ఇఫ్తారు విందులో ఆయన పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు పండ్లు తినిపించి దీక్ష విరమింప చేశారు. అనంతరం ముస్లింలతో కలిసి ఆయన నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా దీవెనలతో కర్నూలు ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోయిన్ బాషా, జనసేన ఇన్‌చార్జి ఆర్షద్, సమి, టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, వార్డు ఇన్‌చార్జి శ్రీధర్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'వైసీపీని ఇంటికి పంపడం ఖాయం'



గూడూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 2: టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే ప్రజలు వైసీపీని ఇంటికి సంపడం ఖాయమని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని కొత్తగేరిలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, యువ టీడీపీ నాయకుడు సృజన్ ఆధ్వర్యంలో ఒకటో వార్డు కౌన్సిలర్ బుడ్డంగలి వార్డులో ఇంటింటికి వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు మల్లాపు బుడ్డంగలి, కోడుమూరు షాషావళి, మాజీ కౌన్సిలర్ మధు, పౌలు, తెలుగు శ్రీనివాసులు, కుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 2: వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం తప్పదని టీడీపీ నాయకులు తెలిపారు. పులకుర్తి, వెంకటగిరి గ్రామాల్లో మంగళవారం సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి తిరిగి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుజాత, నాయకులు నారాయణ, పులకుర్తి సురేంద్ర, నాగేష్ పాల్గొన్నారు.

పర్ల గ్రామంలో గడ్డివాములు దగ్ధం



పర్లలో రైతులతో మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 2: కల్లూరు మండలం పర్ల గ్రామంలో నలుగురు రైతులకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతి అయ్యాయి. మంగళవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పర్లగ్రామాన్ని సందర్శించి రైతులను పరామర్శించారు. అనంతరం రైతులకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, వాకిటి మాదేష్, మాజీ సర్పంచు శేఖర్, రామగిడ్డయ్య, రవి, మహానంది, లక్ష్మన్న పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు



నర్సింగ్ సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సులు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సావిత్రీబాయికి అభినందనలు వెలువెత్తుతున్నాయి. నర్సింగ్ ఆఫీసులో ఆమెను నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 జి.నాగమణి, సీనియర్ హెడ్ నర్సులు, నర్సులు శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి మాట్లాడుతూ ఉద్యోగంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొంటూ నిస్వార్థమైన సేవలు అందిస్తున్న నర్సులు వృత్తిలో మరింత రాణించాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి: టీడీపీ



కర్నూలులో మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 2: ఇళ్ల వద్దనే పింఛన్‌లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నగర అధ్యక్షుడు పి.నాగరాజు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్‌లో టీడీపీ నాయకులతో కలిసి మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ నాయకులు టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పింఛన్లు పంపిణీ చేయవద్దని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నడూ చెప్పలేదని..అయితే ఈ విషయాన్ని వైసీపీ నాయకులు వక్రీకరించి టీడీపీ వలంటీర్లను చిన్నచూపు చేస్తుందనే విధంగా సృష్టిస్తున్నారని అన్నారు. సచివాలయం వద్ద కాకుండా నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి, మాజీ కార్పొరేటర్లు రామాంజనేయులు, అబ్బాస్, మోయిన్‌భాష తదితరులు ఉన్నారు.

గూడూరు: వృద్ధులు, వికలాంగులు ఇతర పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ ఇంటి వద్దే అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. మంగళవారం సీనియర్ టీడీపీ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏవో విజయ సింహారెడ్డికి వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావళి, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, రేమట వెంకటేష్, సృజన్, పౌలు, ఎంపీటీసీ మద్దిలేటి, గుడిపాడు మహేశ్వర రెడ్డి, గోపాల్ రెడ్డి, కృష్ణ, రవి, చిన్న గిడ్డయ్య, బంగారు శ్రీనివాసులు, మునగాల గోపాల్, విజయ్ కుమార్, వీరకుమార్, దమోదర్ రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన పింఛన్‌ల ప్రక్రియను తక్షణమే పంపిణీ చేయాలని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు కర్నూలు రూరల్ మండల టీడీపీ కన్వీనర్ బుర్ర వెంకటేష్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మండల టీడీపీ నాయకులతో కలిసి బొగ్గుల దస్తగిరి కర్నూలు రూరల్ మండల ఎంపీడీవో నరసింహనాయుడుకి వినతిపత్రం సమర్పించారు. ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చిన వారిలో బి.తాండ్రపాడు సర్పంచు జయన్న, ఎంపీటీసీ మద్దిలేటి, జనసేన మండల కన్వీనర్ సురేష్, టీడీపీ నాయకులు రామకృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలంలో అవ్వాతాతలకు వలంటీర్ల ద్వారా కాకుండా పంచాయతీ సెక్రటరీల ద్వారా పింఛన్ల పంపిణీ నిర్వహించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈఓపీఆర్డీ రవికిషోర్‌కు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ.రమణ, వాకిటి.మాదేష్, పవన్‌కుమార్, మస్తాన్‌నాయుడు, విజయ్, ఈవీ.శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శేఖర్, పరమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న బొగ్గుల దస్తగిరి, టీడీపీ మండల నాయకులు



గూడూరులో మండల పరిషత్ కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు



కల్లూరు ఈఓఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న మండల టీడీపీ నాయకులు

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

నిధులు లేక టీడీపీ పై నిందలా..

● పింఛన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం విఫలం
● ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్
● ఎంపీడీవోలకు వినతులు అందజేసిన టీడీపీ

"వైసీపీ ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. నిధుల కొరత ఏర్పడడంతో పింఛన్‌దారులకు ఒకటో తారీఖున పింఛన్లు అందించలేకపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వ నిధులను వారి వ్యక్తిగత కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి ప్రభుత్వ సొమ్మును బుగ్గిపాలు చేశారు. ఇప్పటికైనా టీడీపీపై నిందలు వేయడం మాని, లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందించి చిత్తశుద్ధిని నిరూపించుకోండి" అంటూ తెలుగు దేశం పార్టీ వైసీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు మండల అభివృద్ధి అధికారులను కలిసి పింఛన్ల ప్రక్రియ సజావుగా సాగేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని వినతి పత్రాలు అందజేశారు.

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 2: సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లను పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కొండన్న ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నెల రోజుల ముందే వలంటీర్లతో పింఛన్లను పంపిణీ చేయరాదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. వారికి ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మార్చి 16-30వ తేదీల మధ్యలో సొంత కాంట్రాక్టర్లకు జగన్మోహన్‌రెడ్డి దోచిపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండయ్యచౌదరి, ఖలీముల్లా రాందాసుగౌడు, తురేగల్ నజీర్, సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆలూరు ఎంపీడీవో నరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీరభద్ర గౌడ్, మంత్రాలయం అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి

పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

ఆలూరు, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆలూరు టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ కోరారు. ఈ మేరకు ఆలూరు ఎంపీడీవో నరేంద్ర కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి యథావిధిగా పింఛన్ల పంపిణీ కొనసాగించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గిరి మల్లేష్‌గౌడ్, టీడీపీ నాయకులు సాలి సాహెబ్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల దగ్గరకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలి

ఆస్పరి, ఏప్రిల్ 2: పింఛన్ లబ్ధిదారులకు యథావిధిగా ఇంటి దగ్గరికి వెళ్లి పింఛన్ సొమ్మును అందించాలని టీడీపీ మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, సర్పంచ్ ఆంజనేయులు కోరారు. ఈ మేరకు స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం.. అదే సచివాలయ సిబ్బందితో ఇంటి దగ్గరకు వెళ్లి పింఛను సొమ్ము అందించడానికి సాధ్యపడదా అని ప్రశ్నించారు.

ప్రభుత్వం దుష్ప్రచారం మానుకోవాలి

కౌతాళం: పింఛన్ల పంపిణీ చేతకాని అధికార పార్టీ వైసీపీ లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రతిపక్ష పార్టీపై దుష్ప్రచారం మానుకోవాలని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌నాయుడు అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తను కలిసి వినతి పత్రం అందజేశారు.

వైసీపీ కుట్ర బట్టబయలు ..

కోసిగి : ప్రతి నెలా 1వ తేదీన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పంపిణీ చేయాల్సిన పింఛన్ పంపిణీలో వైసీపీ కుట్ర బట్టబయలైందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, కోసిగి మండల టీడీపీ కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభావతిని, కోసిగి మేజర్ పంచాయతీ ఈవో తిరుమలేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

అవ్వా తాతలకు ఇంటికి వెళ్లి ఇవ్వాలి..

ఆదోని: అవ్వా తాతలకు పెన్షన్లు ఇంటికి వెళ్లి ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు బసవరాజు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో శేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

తుగ్గలి : ప్రభుత్వ ఉద్యోగులే ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

● అధికారులకు కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశం



ఆలూరులో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆలూరు, ఏప్రిల్ 2: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. మంగళవారం ఆలూరు ఆర్‌డీటీ భవన్‌లో ఎన్నికల నిర్వహణపై ఆలూరు నియోజకవర్గ స్థాయి క్లస్టర్, అధికారులు, బూత్ లెవెల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులకు సమీక్ష నిర్వహించారు. ఓటు అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా మోడల్ కోడ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు అభ్యర్థులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్, అన్ని మండలాల తహసీల్దార్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ అబివృద్ధికి సహకరించాలి

● రూ.3 లక్షలు దాత విరాళం

మద్దికెర, ఏప్రిల్ 2 : ఎం.అగ్రహారం శివారు శ్రీకృష్ణ రాతి దేవాలయం నూతనంగా నిర్మిస్తుండటంతో గ్రామానికి చెందిన దివంగత మల్లెబోయిన దేవేంద్ర, శేషమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా కుమారుడు నాగరాజు రూ.3.1116 విరాళంగా మంగళవారం శ్రీకృష్ణ దేవాలయ కమిటీకి అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నూతనంగా శ్రీకృష్ణ రాతి దేవాలయ నిర్మాణం జరుగుతోందని, ఆ నిర్మాణం రూ.కోటితో నిర్మిస్తున్నామని అందువల్ల ప్రజలు, దాతలు దేవాలయ అభివృద్ధి తమకు తోచినంత సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరో మహిళ మృతి

మద్దికెర, ఏప్రిల్ 2 : మద్దికెర గ్రామ శివారులో మార్చి 31న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ ఆవిరెడ్డి సావిత్రమ్మ (65) అనే మహిళ కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఈ నెల 31న చిప్పగిరి మండలంలో మిరపకాయలు తెంచేందుకు కూలీలు ఆటోను అద్దెకు తీసుకుని పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా టైరు పేలి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు కూలీలు మృతి చెందగా.. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో సావిత్రమ్మ అనే మహిళా కూలీ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. సావిత్రమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైతు వ్యథలను పట్టించుకోరా...?

ఆదోని టౌన్, ఏప్రిల్ 2: అగమ్యగోచరంగా తయారైన మిరప రైతులను ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవడం లేదని ఆదోని ఏరియా డెవలప్మెంట్ అసోసియేషన్ కన్వీనర్ ఆదినారాయణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పలు అంశాలను ప్రస్తావిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు రైతు పంట నష్టంపై దృష్టి సారించకపోవడం శోచనీయమని విమర్శించారు. మిరప పంట నష్టపోయిన రైతుల అన్ని బ్యాంకు రుణాలను మాఫీ చేస్తూ, ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారాన్ని అందిస్తామని అన్ని రాజకియ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేస్తాం : ఎంపీడీవో

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 2: గ్రామాల్లో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందజేస్తామని ఎంపీడీవో కొండన్న తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది, కార్యదర్శులను ఏర్పాటు చేశారని అన్నారు. వారిచే 4, 5 తేదీలకల్లా పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సీపీఐ

కోసిగి, ఏప్రిల్ 2: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కోసిగి మండలానికి సమీపంలోనే ఉన్న తుంగభద్ర నది ఉన్నా కూడా మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కనీసం 80వేల జనాభా ఉన్న కోసిగి మండలంలో ఒక్క సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండల పరిధిలోని చిర్తనకల్, సజ్జలగుడ్డం, జంపాపురం, ఐరంగల్ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, ఇప్పటికైనా అధికారులు తాగునీటి బోర్లు వేసి మండల ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. సీపీఐ నాయకులు ఓంకార్ స్వామి, రాజేంద్ర, స్వామిదాస్, బాపు, రమేష్, ఉలిగప్ప, ఈరన్న ఉన్నారు.

లాలప్ప మృతి పార్టీకి తీరని లోటు


లాలప్ప మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 2: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లాలప్ప మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లాలప్ప మృతదేహానికి బీవీ నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు, వైన్‌షాపుల సిబ్బంది


వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, ప్రభుత్వ వైన్‌షాప్ సిబ్బంది

కోసిగి, ఏప్రిల్ 2: ఎన్నిక కమిషన్ ఆదేశాలను కొద్ది మది వలంటీర్లు , ప్రభుత్వ వైన్‌షాపుల సిబ్బంది ఖాతరు చేయడం లేదు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదనే ఆదేశాలున్నప్పటికీ యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నారు. మంగళవారం కోసిగి మండల పరిధిలోని పెద్దభూంపల్లి గ్రామంలో వైసీపీ మండల ఇన్‌చార్జి మురళి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఇంటింటికి ప్రచారం మొదలు పెట్టింది. ఈ ప్రచారంలో పెద్దభూంపల్లి గ్రామ వలంటీర్ బి. నరసింహులు, చిన్నభూంపల్లి గ్రామ వాలంటీర్ శర్వానంద్, కోసిగిలోని ప్రభుత్వ వైన్‌షాపులో పని చేసే చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన కందుకూరు శివరాజులు వైసీపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొని యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. అధికార పార్టీ నాయకలుకు వత్తాసు పలుకుతూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వీరిపై ఎన్నికల అధికారులు వేటు వేస్తారో వేచి చూడాల్సిందే.

ఊపందుకున్న చేరికలు

విరుపాపురంలో 60 కుటుంబాలు టీడీపీలోకి

హాలహర్వి, ఏప్రిల్ 2: విరుపాపురం గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ వీరిని పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రం అభివృద్ధి చేందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ సర్పంచు మల్లికార్జున అన్నారు. వీరభద్రగౌడ్ గెలుపు కోసం పని చేస్తామని వెల్లడించారు.

టీడీపీలో చేరిన శంకరబండ వైసీపీ నాయకులు

ఆస్పరి, ఏప్రిల్ 2: శంకరబండ గ్రామ వైసీపీకి చెందిన కుటుంబాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ సమక్షంలో టీడీపీలో చేరినట్లు మండల కన్వీనర్ పరామ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికలలో ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీ నాయకులు తెలుగుదేశంలో చేరిక

క్రిష్ణగిరి : మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకులు రంగస్వామి, హరినాథ్, పెద్ద కోటయ్య, చిన్న కోటయ్యతో పాటు మరి కొన్ని కుటుంబాలు కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ అరాచకపాలన సహించలేక టీడీపీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

ఎమ్మిగనూరు 3వ వార్డు యువత చేరిక

ఎమ్మిగనూరు : పట్టణంలోని 3వ వార్డుకు చెందిన రామానాయుడు, అనీల్, అబ్దుల్లా, శషి, వంశి, నరసింహ, లక్ష్మన్న, శ్రీనివాసులు, గోపాల్, అస్లాం, వెంకటేష్, తిప్పన్నలతో పాటు మరో 50 మంది యువకులు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ పాల్గొన్నారు.

టీడీపీలోకి 25 వైసీపీ కుటుంబాలు చేరిక

మంత్రాలయం : వగరూరు గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, రాగమ్మ ఆధ్వర్యంలో అంజనేయ, వీరన్న, నల్లన్న, చంద్రశేఖర్, చిట్టిబాబు, చిన్నవీరనాగుడుతో పాటు మరికొంత మంది వైసీపీ నాయకులు, మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


వైసీపీ కార్యకర్తలను టీడీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న బీవీ


రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పెద్దకడుబూరు : వైసీపీ నాయకులు, పెద్దకడుబూరు మాజీ ఎంపీపీ, ప్రస్తుతం సింగిల్‌విండో ఛైర్మన్ హనుమంతారెడ్డి మంత్రాయలం టీడీపీ ఇన్‌చార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ మేరకు హనుమంతారెడ్డి ఇంటిదగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హనుమంతారెడ్డితో పాటు ఆయన కుమారుడు వీరసేనా రెడ్డి, మనవడు ఇంద్రసేనా రెడ్డి వారి అనుచరులకు తిక్కారెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 2: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ పట్టణ సీనియర్ నాయకుడు మహానంద రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య భవనంలో తిప్పన్న అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కుదించి కార్మికులను కార్పొరేట్ వ్యక్తులకు కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వైసీపీ ప్రభుత్వం ముద్దతు తెలపడం సిగ్గుచేటు అన్నారు. హక్కుల కోసం ఆందోళన చేస్తే, ముందస్తు అరెస్టు చేయడం, నోటీసులు ద్వారా భయాందోళనకు గురి చేయడం మంచిది కాదన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరన్న, గోపాల్, లక్ష్మణ, హనుమంతు, మనోహర్, రామచంద్ర, మారెన్న, రాజు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి

క్రిష్ణగిరి, ఏప్రిల్ 2: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పత్తికొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం క్రిష్ణగిరి,రామక్రిష్ణాపురం గ్రామాలలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న,రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. సర్పంచు వరలక్ష్మీ, నబి సాహెబ్, మర్రి శ్రీరాములు, దామోదర్ నాయుడు, ప్రసాద్, మహమ్మద్ రఫీ, చిట్యాల సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

12న మాదిగల సింహగర్జనకు తరలిరండి

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 2: ఈ నెల 12న కర్నూలులో జరిగే మాదిగల సింహగర్జనకు వేలాదిగా మాదిగలు తరలి రావాలని జై భీమ్ ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జ్ఞానయ్య మాదిగ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాయ నగర్, బైచిగేరి, చిన్న పెండేకల్లు, కపటి, సాంబగల్లు గ్రామాలలో సింహగర్జన కరపత్రాలను విడుదల చేశారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తుంటే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలకు నమ్మకద్రోహం చేస్తూనే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మాదిగల సత్తా ఏమిటో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సలహాదారులు ఆంజనేయ, రాజాబాబు, గర్జి హనుమంతప్ప, ప్రకాష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : సీపీఎం


కలెక్టర్‌కు విన్నవిస్తున్న సీపీఎం నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 2: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆలూరుకు వచ్చిన కలెక్టర్ డాక్టర్ సృజనను కలిసి వినతి పత్రం సమర్పించారు. హాలెబీడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఆటో బోల్తా పడి ముగ్గురు మహిళలు మృతి చెందారని, మరో 25 మంది గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. ఇంతవరకు ఒక్క అధికారి కూడా వారిని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నారాయణ స్వామి, హనుమంతు ఉన్నారు.

రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

పత్తికొండ టౌన్ : కూలీ పనులకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు దస్తగిరి, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం పత్తికొండ పర్యటనకు వచ్చిన కలెక్టర్ సృజనను కలిసి వినతి పత్రం ఇచ్చారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

హోం ఓటింగ్ పై అధికారులకు దిశానిర్దేశం

● ఎన్నికల అధికారి శివనారాయణ శర్మ

ఆదోని, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతి ముఖ్యమైనదని, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు భారత ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బీఎల్వోలకు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు హోం ఓటింగ్ పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అధిక అంగవైకల్యం ఉన్న వారికి, 85 ఏళ్ల పైబడ్డ వృద్ధులకు ఇంటి దగ్గర నుంచే ఓటు వేసే హోం ఓటింగ్ సౌకర్యాన్ని అందుబాటులో తెచ్చిందన్నారు.

● ఫారం-12డీ ద్వారా హోం ఓటింగ్...

ఎన్నికలు జరిగే మే 13వ తేదీని దృష్టిలో ఉంచుకొని హోం ఓటింగ్‌కు ఆసక్తి ఉన్న వారి నుంచి ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 23 వరకు దరఖాస్తులను వారి నుండి ఫారం-12డీ సేకరించి దాని ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ మాదిరిగా హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శేషయ్య, తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎల్‌పీవో అధికారి వీరభద్రప్ప, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీటీలు రామేశ్వర్ రెడ్డి, రుద్రగౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీఎం రాజీనామా చెయ్యాలి


సీఐ నరసింహరాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని, ఏప్రిల్ 2: ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలపై నైతిక బాధ్యత వహిస్తూ సీఎం జగన్ రెడ్డి రాజీనామా చెయ్యాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక త్రీటౌన్ సీఐ నరసింహరాజుకు వినతిపత్రం అందజేశారు. ఏపీ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో జరిగిన అవకతవకల పై విచారణ చేపట్టాలని కోరారు. జవాబు పత్రాలను మార్చడం, అభ్యర్థులను ఎంపిక చెయ్యడం ద్వారా సాక్ష్యాలను నాశనం చేస్తూ తప్పుడు సమాచారం ఇచ్చిన సీఎంపై, ఆనాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏపీపీఎస్సీ ఛైర్ పర్సన్ గౌతం సవాంగ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణ రెడ్డి పై నేరపూరిత కుట్ర కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు బోయ తేజ, పద్మశాలి రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బిల్లేకల్ సూర్య, నాయకులు నూర్ బాషా, సాయి, రఘు, పాల్గొన్నారు.

పాత మారెమ్మ దేవాలయంలో చోరి

ఆస్పరి, ఏప్రిల్ 2: జొహరాపురం రోడ్డు దగ్గర పొలాల్లో వేపచెట్టు కింద ఉన్న పాత మారెమ్మ అవ్వ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఆలయ పూజారి మంగళవారం యథావిధిగా ఆలయంలో పూజలు నిర్వహించడానికి వెళ్లగా, అక్కడే వేపచెట్టు కింద పగలిపోయి పడివున్న ఆలయ హుండీలను గమనించాడు. అలాగే దేవస్థానంలోకి వెళ్లి చూడగా, లోపల ఉన్న మరో హుండీ కూడా పగలకొట్టి, అందులో ఉన్న నగదుతో పాటు, వెండితో తయారు చేసిన కొరమీసాలు, కళ్లు, ఇతర ఆభరణాలు దొంగతనానికి గురైనట్లు గ్రహించాడు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల, ఏప్రిల్ 2: మండల పరధిలోని హెచ్ కైరవాడి గ్రామ సమీపంలోని హంద్రీ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ యజమాని గొల్ల రంగస్వామి పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. మంగళవారం హెచ్ కైరవారడి గ్రామ హంద్రి నది దగ్గర మధ్యాహ్నం గోనెగండ్ల లక్ష్మీపేటకు చెందిన గొల్ల రంగస్వామి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా కాపు కాచి ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అధికారుల అనుమతు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చెరుకులపాడులోకి అనుమతించండి


జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి, ఏప్రిల్, 2 : వెల్దుర్తి మండలం చెరుకులపాడుకు చెందిన 30 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గ్రామంలోకి అనుమతించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ.నాయుడు, ఈదుల వెంకటరాముడు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డిమౌర్యకు వినతి పత్రం సమర్పించారు. బీటీ నాయుడు మాట్లాడుతూ చెరుకులపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పి.రామాంజనేయులు, బి.రామాంజనేయులు, ఎం.పెద్దయ్య, కె.రామకృష్ణ, చాకలి సుబ్బరావు 13 కుటుంబాలకు చెందిన 30 మందిని ఎమ్మెల్యే శ్రీదేవి గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు రక్షణ బాధ్యతలను విస్మరించి మాట్లాడుతున్నారన్నారు. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే ఊర్లోకి రండి ఎమ్మెల్యేనే మరలా వస్తే ఊర్లోకి రావద్దండి కావాలంటే ఖర్చుల కింద రూ.50 వేలు ఇస్తాను అని సీఐ తెలిపినట్లు జేసీకి వెల్లడించారు. పోలీసుల ద్వారా రక్షణ కల్పించి మాకు ఊర్లోకి వెళ్లడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 2: దైవందిన్నె గ్రామంలో అక్రమంగా ఇంట్లో ఉంచుకున్న కర్ణాటక మద్యం ను సెబ్ సీఐ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సీఐ భార్గవరెడ్డి తెలిపిన వివరాల మేరకు ఈడిగ ఉరుకుందమ్మ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అకస్మాతుగా దాడి చేసి ఇంట్లో ఉన్న 576 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది లింగ ప్రసాద్, నరసింహారెడ్డి, భరత్, లక్ష్మన్న పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ఆలూరు : నియోజకవర్గం హాలహర్వి మండలం, బిల్లేహాల్ గ్రామంలో మంగళవారం దాడులు నిర్వహించి బోయ రాధమ్మ అనే మహిళ ఇంట్లో నిలువ ఉంచిన 4 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సోమశేఖర్ తెలిపారు.

కైరుప్పలలో ..

ఆస్పరి : అక్రమంగా నిలువ ఉంచిన 51 కర్ణాటక మద్యం బాక్సులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. మండల పరిధిలోని కైరుప్పల గ్రామానికి చెందిన ఎరుకుల మహేంద్ర అక్రమంగా నిలువ ఉంచుకున్న 51 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మద్యం స్వాధీనం, వ్యక్తి అరెస్టు

హొళగుంద : హెబ్బటం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన కర్ణాటక మద్యం బాక్సులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పెద్దయ్య నాయుడు మంగళవారం తెలిపారు. ఆదోనికి చెందిన గుబ్బలి పెద్ద లక్ష్మన్న అనే వ్యక్తి తన గడ్డివాములో 25 బాక్స్‌ల కర్ణాటక మద్యం బాక్సులు నిల్వ ఉంచినట్లు సమాచారం మేరకు దాడి చేసి గడ్డివాములో సోదాలు చేసి మద్యం బాక్స్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.